www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025
5
కాకినాడ



వాగు దాటుతూ బాలుని గల్లంతు

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

మేనమామతో కలిసి బైకుపై కాల్వ దాటుతూ 11 ఏళ్ల బాలుడు కొట్టుకుపోయిన సంఘటన కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట వద్ద కాలువ వద్ద సోమవారం చోటు చేసుకుంది. తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం 6వ తరగతి విద్యార్థి పోలవరపు సాయి చరణ్ (11) తన మేనమామతో కలిసి సూర్యారావుపేట నుంచి వచ్చకాలువ మీదుగా ఉన్న వంతెనపై బైకుపై వెళుతుండగా ప్రమాదవశాత్తు బైకు అదుపు తప్పడంతో బాలుడు వాగులో కొట్టుకు పోయాడు. వెంటనే పోలీసులు, సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు.

హడలెత్తిస్తున్న మొంథా

- నేడు కాకినాడలో తీరం దాటే అవకాశం
- జిల్లావ్యాప్తంగా మొదలైన వర్షాలు
- అప్రమత్తమైన యంత్రాంగం
- మంత్రి, ప్రత్యేకాధికారి సమీక్ష

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మొంథా తుపాను కాకినాడ జిల్లాపై పెద్ద ఎత్తున ప్రభావం చూపుతోంది. సోమవారం ఉదయం నుంచే ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. కాకినాడకు 515 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. మంగళవారం రాత్రికి ఇది కాకినాడ, తుని మధ్య తీరం దాటే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో కాకినాడ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ నెల 31 వరకు విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేశారు. 50 మందితో ఎస్‌డిఆర్‌ఎఫ్, 30 మందితో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నాయి. ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేరవేసేందుకు 40 బోట్లను, 100 మంది సిబ్బందిని, 140 గజ ఈతగాళ్లను అందుబాటులో ఉన్నారు. యు. కొత్తపల్లి మండలం ఉప్పాడ వద్ద అలల ఉధృతి పెరిగింది. రాకాసి అలలు బీచ్ రోడ్డును తాకుతున్నాయి. కాకినాడ-ఉప్పాడ బీచ్ రోడ్డుపై రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. పెరుమాళ్లపురం నుంచి అద్దరిపేట, ఉప్పాడ, కాకినాడ రూరల్ వరకు తీరం వెంబడి ఈదురు గాలుల ప్రభావం మొదలైంది. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది వద్ద 500 మీటర్ల మేర సముద్రం వెనక్కి వెళ్లింది. తీవ్ర తుపానుల సమయంలో మాత్రమే ఇలా జరుగుతుందని స్థానిక మత్స్యకారులు తెలిపారు.

269 పునరావాస కేంద్రాల ఏర్పాటు

తుపాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో 269 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పాఠశాల భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ వసతి గృహాల్లో తాత్కాలిక పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రతి పునరావాస కేంద్రానికి ఇంచార్జిలను నియమించారు. ప్రతి కేంద్రం వద్ద ఏడు రోజులకు సరిపడా నిత్యావసరాలు, మందుల నిల్వలు ఏర్పాటు చేశారు. ఉప్పాడ, మూలపేట, కోనపాపపేటల్లో కుకింగ్ సెంటర్లు ఏర్పాటుతో పాటు, అన్నవరం దేవస్థానం, అక్షయ, అల్లూరి సీతారామరాజు ఫౌండేషన్ ద్వారా 10 వేలు చొప్పున ఆహార ప్యాకెట్లు సరఫరా చేసేందుకు సిద్ధం చేశారు.

ఏలేరుకు పోటెత్తుతున్న వరద నీరు

ఎగువున కురుస్తున్న వర్షాలతో ఏలేరు రిజర్వాయర్‌కు వరద నీరు పోటెత్తుతుంది. 24 టిఎంసిల సామర్థ్యం గల ఏలేరు ప్రాజెక్టులో ప్రస్తుతం 22 టిఎంసిల నీరు వచ్చి చేరింది. దిగువకు 3,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సామర్లకోట-పిఠాపురం రోడ్డులో ఉన్న పెద్ద ఏలేరు బ్రిడ్జి వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరదనీటిని మరింత కిందకు వదిలితే 30 వేల ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

తీర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. ఇప్పటికే హోప్ ఐలాండ్‌లో నివాసం ఉంటున్న 110 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. కొందరు మత్స్యకారులు ఇళ్లను విడిచిపెట్టేందుకు నిరాకరించడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు నచ్చజెప్పి కేంద్రాలకు పంపుతున్నారు.



ఉప్పాడలో విరుచుకుపడుతున్న సముద్రపు అలలు

16 వేల ఎకరాల్లో ముంపు

తుపాను నేపథ్యంలో కురుస్తున్న వర్షాలకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 16 వేల ఎకరాల్లో వరి చేలు ముంపునకు గురయ్యాయి. కాకినాడ జిల్లాలో 6 వేల ఎకరాలు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7,500 ఎకరాలు, తూర్పు గోదావరి జిల్లాలో 2,500 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.



కాకినాడ వార్ఫు రోడ్డులో నేల కూలిన చెట్టు

పెరుగుతున్న ఏలేరు, తాండవ నదీ ప్రవాహాలు

ప్రజాశక్తి - సామర్లకోట

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు సామర్లకోట వద్ద ఏలేరు కాలువలో వరద నీటి ఉధృతి పెరిగింది. ఏలేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని దిగువకు విడుదల చేయడంతో ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో సామర్లకోట పిఠాపురం రోడ్డులోని పెద్ద ఏలేరు బ్రిడ్జి వద్ద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వరద నీటిని చూసేందుకు ప్రజలు తరలి వస్తున్నారు. తుపాను ప్రభావంతో ఉదయం నుండి వర్షం కురవడంతో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఏలేరు వరద ఉధృతి కారణంగా దిగువ ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



పొంగుతున్న ఏలేరు రిజర్వాయర్

భయం నీడన తాండవ పరీవాహక ప్రజలు

కోటనందూరు విస్తారంగా కురుస్తున్న వర్షానికి తోడు తుపాను ప్రభావంతో తాండవ రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో భయాందోళనలకు గురవుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వర్షపు నీరు తాండవ రిజర్వాయర్ లోనికి వచ్చి చేరడంతో తాండవ రిజర్వేర్‌లో నీటి నిల్వలు ప్రమాద స్థాయికి చేరుకున్నాయి. ముందుస్తు జాగ్రత్తగా చర్యల్లో భాగంగా నీటిని దిగువకు విడుదల చేశామని అధికారులు తెలిపారు.

43 రైళ్లు నిలిపివేత

సామర్లకోట తుపాను ప్రభావంతో సౌత్ సెంట్రల్ రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రయాణికుల సౌకర్యార్థం సామర్లకోట రైల్వే స్టేషన్‌లో హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ చెప్పారు. దక్షిణ మధ్య రైల్వేలో రద్దయిన రైళ్ల విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం, నిడదవోలు, మచిలీపట్నం, రాజమండ్రి, భీమవరం ప్రాంతాల మధ్య నడిచే పలు రైళ్ల రద్దు చేసినట్లు తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖపట్నం, కోరాపుట్, రాయగడ, గుంటూరు, తిరుపతి, బ్రహ్మపూర్, కటక్ ప్రాంతాల మధ్య నడిచే పలు రైళ్లను నిలిపివేసినట్లు తెలిపారు. ఇతర ప్రాంతీయ, ప్యాసింజర్ రైళ్లను కూడా తాత్కాలికంగా రద్దు చేసినట్లు తెలిపారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి పెద్దాపురం

లోతట్టు ప్రాంతాలను సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబు ఆధ్వర్యంలో అధికారులు పర్యటించి పరిశీలించారు. స్థానిక కుమ్మరి వీధి శ్మశాన వాటిక వెనుక ఉన్న చెరువును పరిశీలించారు. ఈ చెరువులో నీరు నిండుగా ఉండటంతో చెరువుగట్టు తెగితే నివాస ప్రాంతాలకు ప్రమాదం జరుగుతుందని పలు చర్యలు చేపట్టారు.

ఏలేరు దబ్బ కాలువ పరిశీలన

కాండ్రకోటలోని ఏలేరు దబ్బ కాలువను సోమవారం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పరిశీలించారు. ఏలేరు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయటం వల్ల ఏలేరు కాలువల ద్వారా నీటి ప్రవాహం అధికంగా ఉండే ప్రాంతాల్లో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తుపాను తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున నిరంతరం రైతులను, ప్రజలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. అధికారులు సిబ్బంది ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు ప్రజలకు అండగా ఉండాలన్నారు.

%ఫ్లాణా% 2: దబ్బ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిన్న రాజప్ప

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

సామర్లకోట తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. సోమవారం భీమేశ్వరాలయం వద్ద ఆయన మాట్లాడారు. తుపాను పరిస్థితులను పర్యవేక్షించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నామని ఆయన వెల్లడించారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

గొల్లప్రోలు లోతట్టు ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి తహశీల్దారు రామ్‌కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సంక్షిస్తున్నారు. పట్టణంలో నాలుగు పాఠశాలలు, మండలంలోని ప్రతి గ్రామంలో ఒక్కో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు.

వరి పొలాల పరిశీలన

కరప మండలంలో వర్షాలు కురవడంతో వరిపొలాలు గాలికి పడిపోయిన వరి నీటమునిగాయి. వ్యవసాయ సంచాలకులు కె.బాబూరావు, ఎఒ ఐ.సత్య, డిసి చైర్మన్ పీజీ సత్యనారాయణ, నాయకులు పలువురు రైతులతో కలిసి వేములవాడలోని వరి పొలాలను పరిశీలించారు. పంట రక్షణకు అవసరమైన సూచనలు చేశారు.

రౌతులపూడి మండలంలోని పలు ప్రాంతాల్లో అధికారులు పర్యటించారు. బంగారయ్య పేట వెళ్లే రహదారిలోని ఏలేరు ఎడమ కాలువ ఉధతిని ఎస్ఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో పరిశీలించారు. ములగపూడిలో తుపాను బాధితులకు కేటాయించిన పునరావాస కేంద్రాలను తహశీల్దార్ నరేష్ పరిశీలించారు.

కాకినాడ రూరల్ ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి తుపాను తీవ్రతను వివరిస్తూ పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని కాకినాడ రూరల్ ఎంఎల్ఎ పంతం నానాజీ ప్రజలను కోరారు. సోమవారం తుపాను కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాల వారికి పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. వాకలపూడి, సూర్యారావుపేట, హార్బర్‌పేటలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి తుపాను తీవ్రతపై అవగాహన కల్పించారు.



ఉప్పాడ తీరంలో సముద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఉప్పాడలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, జిల్లా తుపాను ప్రత్యేకాధికారి కృష్ణతేజ, ఎస్‌పి బిందు మాధవ్‌తో కలిసి సోమవారం యు.కొత్తపల్లి మండలంలో పర్యటించారు. మండలంలోని సముద్ర తీరాన్ని పరిశీలించారు. లోతట్టు, పల్లపు ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ ఉన్న ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని సూచించారు. ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 269 పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధం చేశామన్నారు. తుపాను ప్రభావిత మండలాల్లోని ప్రతి గ్రామంలో అధికారులు ఇంటింటికీ వెళ్లి తుపాను సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఉప్పాడ తీరప్రాంతాన్ని వైసిపి పిఠాపురం ఇన్‌ఛార్జి, కాకినాడ మాజీ ఎంపీ వంగా గీత పరిశీలించారు. సముద్రానికి దగ్గరలో ఉన్న మత్స్యకారులను అక్కడ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.

నష్ట నివారణకు పటిష్ట రక్షణ చర్యలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నారాయణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తుపానుతో జిల్లాలో ఒక్క ప్రాణ నష్టం కూడా లేకుండా, పంట, ఆస్తి నష్టాలను కనిష్ఠ స్థాయికి నియంత్రించాలని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను, సంసిద్ధతపై ఆయరన సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఆయనతో బాటు జిల్లా తుపాను ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి కృష్ణతేజ, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, గంటి హరీష్ మాధూర్, ఎంఎల్‌సిలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, ఎంఎల్‌ఎలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, ఎస్‌పి జి.బిందుమాధవ్ పాల్గొన్నారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ తుపాను పరిస్థితిపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షించి ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు.

అనంతరం ఆయన జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 28న రాత్రి గానీ, 29న తెల్లవారుజామున గానీ తుపాను కాకినాడ పరిసర ప్రాంతాల్లో తీరం దాటే అవకాశం ఉందన్నారు. ప్రభావిత ప్రాంతాల్లో తాత్కాలిక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందిని, గజ ఈతగాళ్లను సిద్ధం చేశామన్నారు. లారీలు, టిప్పర్లు, జెసిబిలు, జనరేటర్లు అందుబాటులో ఉంచామన్నారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 22 టిఎంసిల నీటి నిల్వలు ఉండగా 21.05కు తగ్గించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వరద ఉధతిని బట్టి ఎప్పటికప్పుడు నీటిని కిందకు విడుదల చేస్తామని, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేలా చర్యలు తీసుకున్నామన్నారు.

తుపాను నేపథ్యంలో ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంపై సోమవారం అమరావతి నుంచి ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కలెక్టరేట్ నుంచి మంత్రి నారాయణ, ప్రత్యేకాధికారి కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్‌పి బిందు మాధవ్, ఎంపీలు, ఎంఎల్‌ఎలు హాజరయ్యారు. తుపాను ప్రభావాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి, ప్రజలను అప్రమత్తం చేయాలని సిఎం అధికారులకు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

1,522 ఎకరాల్లో దెబ్బతిన్న వరి

ప్రజాశక్తి - సామర్లకోట



నేలకొరిగిన పంటను పరిశీలిస్తున్న అధికారులు

మండల పరిధిలోని 17 గ్రామాల్లో ఇప్పటివరకు 1522 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు గుర్తించామని మండల వ్యవసాయ అధికారి వంగపండు మురళీధర్ తెలిపారు. తపాను నేపథ్యంలో సోమవారం మండల పరిధిలోని పెదబ్రహ్మదేవం, జి.మేడపాడు, వేట్లపాలెంలో ఆయన పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకూ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతులు వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలని పిలుపునిచ్చారు.

కలవర పెడుతున్న ఏలేరు కాలవ గట్టు

ప్రజాశక్తి - సామర్లకోట

ఏ క్షణమైనా వరద నీటి ఉధృతి పెరిగి వికె.రాయపురం వద్ద ఏలేరు కాలవ గట్టు గండిపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అధికారుల అప్రమత్తమై గండి పడకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. వికె.రాయపురం నుంచి సత్యవరపు పేటకు వెళ్లే వంతెన వద్ద ఏలేరు కాలువకు తరచూ వరదల సమయాల్లో తరచూ గండి పడుతుంటుంది. ఇక్కడ గండి పెడితే వికె.రాయపురం సచివాలయం పేట మాధవపట్నం ప్రాంతాల్లో పొలాలు మునగడంతోపాటు గృహాలు కూడా జలదిగ్బంధనం అయ్యే ప్రమాదం ఉంది. దీంతో అధికారులు ముందుగానే స్పందించి చర్యలు చేపట్టారు.


అప్పన్నపాలెం వంతెనపై రాకపోకలు బంద్

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఏలేరు భారీ వరద నేపథ్యంలో ఏలేశ్వరం అప్పన్నపాలెం వంతెనపై అధికారులు పూర్తిగా రాకపోకలు నిలిపివేశారు. 2021లో సంభవించిన భారీ వర్షాలకు వంతెన కుంగిపోయింది. అనంతరం విజయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వంతెనపై తాత్కాలిక రహదారి ఏర్పాటు చేశారు. పాదచారులు, బైకులు తిరిగే అవకాశం ఏర్పడింది. ఏలేరు రిజర్వాయర్ నుండి 4200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో వంతెనపై రాకపోకలు ప్రమాదకరంగా మారాయి. తహశీల్దారు కుశరాజు ఆధ్వర్యంలో సిబ్బంది వంతెనపై రాకపోకలు పూర్తిగా నిషేధిస్తూ బ్యానర్లు ఏర్పాటు చేశారు. ఇరువైపులా కాపలా నిర్వహిస్తున్నారు. వంతెనపై రాకపోకలు నిలిపివేయడంతో జగ్గంపేట నియోజకవర్గం, ప్రతిపాడు నియోజకవర్గం మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అప్పన్నపాలెం వాసులు ఏలేశ్వరం రావాలంటే ఎర్రవరం మీదుగా 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిందే.



జిజిహెచ్‌లో ఆందోళన చేస్తున్న శానిటేషన్ వర్కర్స్



మందులపై పన్ను రద్దు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-కాకినాడ

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, విద్యార్థులందరికీ పరీక్ష ఫీజులు కట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద తుపానును సైతం లెక్కచేయక సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.గంగాసూరిబాబు, నగర అధ్యక్షులు వాసుదేవ్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో రాకముందు ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు ఇబ్బంది లేకుండా కళాశాల అకౌంట్‌లోనే వేసి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారని, నేడు విద్యార్థులను తుపానులో సైతం ఇబ్బంది పడే విధంగా చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాకినాడ జిల్లాలో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలు అన్యాయంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కళాశాలకు వేస్తాము, విద్యార్థులు ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా వాళ్ల పరీక్ష ఫీజులు, సర్టిఫికెట్లు ఆపకూడదని చెప్పినా ఇంజినీరింగ్ కాలేజీలు విద్యార్థులని రాబందుల్లాగా పరీక్ష ఫీజుల కోసం కాల్చుకు తింటున్నారని విమర్శించారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జిల్లాలో ఇప్పటికే ఈ సమస్యను పరిష్కారం చేయాలని గతంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఒలకు వినతిపత్రాలు ఇచ్చిన పట్టించుకోలేదనాన్రు. ఇంజినీరింగ్ రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్ష ఫీజు కట్టడానికి సోమవారమే చివరి తేదీ అని ఇప్పటికే జెన్‌టియు ప్రకటించిన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయరాం, గమినివేలు, వాసుదేవ్, కరిష్మా, మానస, మాధురి, ఝాన్సీ, శశిప్రియ, శిరిష, ప్రసాద్, శశాంక్, సాకేత్, దుర్గా ప్రసాద్, వివేక్ పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి

ప్రజాశక్తి-కాకినాడ

పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ జిజిహెచ్ శానిటేషన్ వర్కర్స్ సోమవారం ఆసుపత్రి ప్రాంగణంలో వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు, యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్ అక్టోబర్ 1 నుంచి జిజిహెచ్‌లో శానిటేషన్ నిర్వహణ క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ కాంట్రాక్ట్ పొందిన నేపథ్యంలో ముందుగానే కార్మికుల డిమాండ్స్ యూనియన్ తరపున రాతపూర్వకంగా అందించారు. ఇప్పటివరకు నాలుగుసార్లు కాంట్రాక్ట్ సంస్థతో యూనియన్ ప్రతినిధులు చర్చలు జరిపిన పూర్తిస్థాయిలో జీతం పెంపు విషయం తేలలేదన్నారు. సోమవారం చర్చలు పూర్తి చేసి రాతపూర్వక ఒప్పందం చేసుకోవాలని కోరుతున్నామన్నారు. జీతాల విషయమై సూపరిండెంట్‌ను సంప్రదించగా శానిటేషన్ ఏజెన్సీ కార్మికులు ఈ విషయం తేల్చుకోవాలని రాతపూర్వకంగా తెలియజేశారన్నారు. సెప్టెంబర్ నెల జీతం నేటికీ చెల్లించలేదని తెలిపారు. వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు కూడా పెరిగిన ధరలను దష్టిలో ఉంచుకొని శానిటేషన్ వర్కర్స్ జీతాలు పెరిగే విధంగా ఉత్తర్వులు ఇప్పించాలని కోరుతున్నామన్నారు. ఒప్పందం జరగని పక్షంలో మంగళవారం నుంచి ఆందోళన తీవ్రతరం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణతో పాటు యూనియన్ నాయకులు జె.శేషు, ఆర్.రమేష్, ఎస్.వాసు, బి.మంగతాయారు, బి.కృష్ణవేణి, ఎం.రవిబాబు, డి.దుర్గాప్రసాద్, శ్రీకాంత్, మీసాల కుమారి, ఆర్.తలుపులమ్మ, వివియన్ కుమార్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లో 1,173 మందికి ఆశ్రయం

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలో 25 పునరావాస కేంద్రాల్లో సోమవారం రాత్రికి 1,173 మంది ప్రజలు చేరుకున్నారని చేరుకున్నారని తహశీల్దార్ పి.త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు ఆ కేంద్రాల్లో ఉన్న ప్రజలకు వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గాడిమొగ, పోలేకుర్రు పునరావాస కేంద్రాల్లో అత్యధిక ప్రజలు తలదాచుకున్నట్లు తెలిపారు. మండలంలో 23 పునరావస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహశ్శల్దార్ పి.త్రినాథరావు తెలిపారు. తుపాను ప్రభావిత గ్రామాలకు సంబంధించి 8 పునరావాస కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి అడపా వెంకటలక్ష్మి సోమవారం అధికారులతో సమీక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 9676822336 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

నియోజకవర్గవ్యాప్తంగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ తెలిపారు. తుపాను తాకిడికి గురయ్యే ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లూ చేశామని తెలిపారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు అందించేందుకు ట్రాక్టర్లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచినట్లు చెప్పారు.

గొల్లప్రోలు-తాటిపర్తి రాకపోకల నిలిపివేత

ప్రజాశక్తి-గొల్లప్రోలు



వంతెనపై రాకపోకలు నిలిపివేసిన అధికారులు

గొల్లప్రోలు నుంచి తాటిపర్తికి వెళ్లే పుంత రోడ్డును నిలిపివేశారు. సోమవారం కురిసిన వర్షం కారణంగా సాయంత్రం సుద్దగడ్డ వాగు ఉధృతి పెరిగింది. దీంతో మండలంలోని తాటిపర్తికి వెళ్లే పుంత రోడ్డుపై సుద్దగడ్డ ఉధృతి పెరగడంతో రోడ్డుపై ఎక్కువనీరు చేరింది. దీంతో తాత్కాలికంగా రాకపోకలు నిలిపి వేస్తున్నట్టు ఎంపిడిఒ సెలెట్ రాజు తుపాను పర్యవేక్షణ, ఎంఇఒలు వెన్నా శ్రీనివాస్ రావు, బి.శివప్రసాద్, గ్రామ రెవెన్యూ అధికారి లోవరాజు తెలిపారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలీని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ప్రభుత్వ హాస్పటల్ ఆవరణలోని పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద నూతనంగా నిర్మిస్తోన్న భవనంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. కనీసం గుర్తించలేని విధంగా పురుగులు పట్టి, కుళ్ళిపోయి ఉంది. ఇది హత్యా, ఆత్మహత్యా అనేది తెలియాల్సి ఉంది. హాస్పటల్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి- గోకవరం

మారణాయుధాలు చూపించి దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గుర్ని గోకవరం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 6వ తేదీ రాత్రి కొత్తపల్లి రహదారిలోని జిమ్ సెంటర వద్ద దుర్గాప్రసాద్ అనే వ్యక్తి రోడ్డు పక్కన ఆగి టాయిలెట్‌కి వెళ్తున్నాడు. ఈ సమయంలో అతని వద్దకు చిరునామా పేరుతో వెళ్లి చాకు చూపించి చంపేస్తామంటూ బెదిరించి సెల్ ఫోను, రూ.2 వేలు నగదు, స్కూటీ లాక్కొని పారి పోరన్నారన్నారు. దీంతో వారిపై నిఘా పెట్టామన్నారు. గోకవరం గ్రామానికి చెందిన నల్లంశెట్టి రాజేష్, లింగంపల్లి శివమోహన్, తుమ్మల అరవిందలను అరెస్టు చేశామన్నారు. వీరు గ్రామ శివారులో మారణా యుధాలు చూపించి దాని దోపిడీకి పాల్పడుతున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

కాపవరంలో హైవేపై లారీ బోల్తా

ప్రజాశక్తి-కొవ్వూరు

కాపవరం జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దేవరపల్లి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న బియ్యం లోడు లారీ ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. లారీ డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

దాడి చేశారని మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

తమపై దాడి చేశారంటూ ఇనుగంటివారి పేటకు చెందిన ఇనుమర్తి జ్యోతి సోమవారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 24న ఇనుగంటివారిపేటలో తన సోదరుడు వేమగిరి సూరిబాబు, సోదరి రజనీలను అదే గ్రామానికి చెందిన వీధి స్వామి, అతని కుమారులు నాని, అరుణ్, తమ్మిరిసి బాలు దౌర్జన్యంగా కొట్టారని జ్యోతి తెలిపింది. ఎస్‌సి కమ్యునిటీ హాల్ వద్దకు ఈడ్చుకెళ్లి రక్తపు గాయాలయ్యేలా కొట్టరన్నారు. తన సోదరుని కేకలు విని కాపాడ్డానికి వెళ్లానని పేర్కొంది. దీంతో వారు తనపై బూతులు తిడుతూ దాడికి దిగారని తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

గుల్లిపాడులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోటనందూరు

తుని రైల్వే స్టేషన్ పరిధిలో గుల్లిపాడు స్టేషన్ సమీపంలో గుర్తుతెలియన ట్రాన్స్‌జెండర్ మరణించినట్టు తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. మరణించిన వ్యక్తికి 30 ఏళ్ల వయసు ఉంటుందని, తెలిపారు. కుడి చేతిపై అమ్మ అని ఇంగ్లీషులో పచ్చబొట్టు ఉందన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని ఉప్పంగలలో దుండగులు మహిళ మెడలో గొలుసు అపహరించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కార్తీక సోమవారం కావడంతో శివాలయానికి వెళుతున్న గ్రామానికి చెందిన కట్టా రామలక్ష్మి మెడలో బంగారు గొలుసును బైకుపై వచ్చిన ఇద్దరు ఆగంతుకులు లాక్కుని పరారయ్యారు. దీనిపై ఆమె కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రావులపాలెం

వెదిరేశ్వరంలో ఒక గృహంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అరెస్టు చేసినట్లు సిఐ శేఖర్‌బాబు తలెఇపారు. అలాగే స్థానిక బండిరేవుపుంత పబ్లిక్ స్థలంలో పేకాటాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ చంటి తెలిపారు. వెధిరేశ్వరంలో రూ.25,070, బండిరేవుపుంతలో రూ.2,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పాదగయను దర్శించిన ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి-పిఠాపురం

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయను ముమ్మిడివరం ఎంఎల్ఎ ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఇఒ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పదో శక్తి పీఠం పురుహూతికా అమ్మవారిని, కుక్కుటేశ్వర స్వామివారిని, రాజరాజేశ్వరి అమ్మవారిని, దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు పాద గయ క్షేత్ర విశిష్టతను ఎంఎల్ఎ దంపతులకు వివరించారు. అనంతరం ఇఒ వారికి స్వామివారి శేషవస్త్రములు, చిత్రపటాలు,ప్రసాదములను అందజేశారు. ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ, అల్లంరాజు చంద్రమౌళి, దేవస్థానం సూపరింటెండెంట్ బొల్లం వీరభద్రరావు, రెడ్నం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కొప్పిశెట్టి దత్తాత్రేయ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ క్యాంటీన్‌కు జుజ్జవరపు శ్రీనివాస్ చౌదరి సాయం అందించగా టిడిపి నేతలు హాజరై పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు జీను మణిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర పాల్గొన్నారు.

ప్రయివేటీకరణతోనే అభివృద్ధా.?

-పార్కుల నిర్వహణ ప్రయివేటుకి యత్నం
-ప్రవేశానికి ఛార్జీల వసూలు తప్పదు
-ఆహ్లాదానికి దూరం కానున్న సామన్యులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలోని ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కాకినాడ స్మార్ట్ సిటీలో పార్కుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఆదర్శమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా ఇది జరుగుతున్నట్లు ప్రకటిస్తున్నారు. రాబోయే రోజుల్లో పార్కులను ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తారు. ప్రధానంగా 9 పార్కులను తొలి దశ కింద గుర్తించారు. వివేకానంద పార్క్, బోట్ క్లబ్ పార్క్, అన్నాం ఘాటి పార్క్, సంత చెరువు పార్క్, జన్మభూమి పార్క్, సురేష్ నగర్ పార్క్, గాంధీనగర్ పార్క్, కెనాల్ బ్రాంచ్ పార్క్, అమరావతి పార్కులను వ్యాపార, పారిశ్రమక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు సామాజిక బాధ్యత కింద దత్తతు ఇచ్చేందుకు నగర పాలక సంస్థ సిద్ధంగా ఉంది. అయితే ప్రయివేటీకరణతోనే అభివృద్ధి జరుగుతుందా? అనే ప్రశ్న నగరవాసుల నుంచి వినిపిస్తోంది. ఇప్పటికే నగరం స్మార్ట్ సిటీ నిధులతో పలు రంగాలను అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో పార్కుల నిర్వహణ ప్రయివేటు సంస్థలకు అప్పగించే నిర్ణయంపై సర్వాత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిపిఎం, ప్రజా సంఘాలు, సామాజికవేత్తలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

నగరంలో సుమారు 5 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవసరాల నిమిత్తం నగరం, నగరానికి అనుకుని ఉన్న ప్రాంతాల్లో నివాసాలను ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కువమంది పేదలు సామూహికంగా ఇరుకు ఇళ్లల్లో నివసిస్తారు. మధ్యతరగతి వర్గాలు అయితే అపార్టుమెంట్లలో నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే సహజంగానే ఆహ్లాదకరంగా వాతావరణం కనిపిస్తుంది. పట్టణాల్లో అందుకు విరుద్ధంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆహ్లాదం కోసం పలువురు పార్కులను ఆశ్రయిస్తున్నారు. పట్టణాల్లో నివసిస్తున్న జనాభా వినోదం కోసం సినిమాలకు వెళుతుంటారు. అయితే సినిమా టికెట్ల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో పార్కులకు వెళ్లేందుకు ఇష్టపడుతుంటారు. పార్కులు చుట్టూ అనేకమంది చిరు వ్యాపారులు స్వయం ఉపాధి కోసం వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయివేటు వ్యక్తులకు పార్కుల నిర్వహణ భారం అప్పగిస్తే ఆటలు, ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తారు. ఆహ్లాదకరమైన పార్కులలో వీటిని ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు నగరవాసుల నుంచి వినిపిస్తున్నాయి. ఆటల కోసం క్రీడాస్థలాలను అభివృద్ధి చేయాలి తప్ప ఇలా పార్కులలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే ఆహ్లాదం ఆవిరి అవడం ఖాయమనే అభిప్రాయం వినిపిస్తోంది. ఫుడ్ కోసం ఈట్ స్ట్రీట్‌లు ఇప్పటికే ఉన్నాయి. అయితే వీటిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రతిపాదనలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కుల్లో ఎగ్జిబిషన్ ప్రాంగణాలు, ఫుడ్ కోర్టులు, నెట్ క్రికెట్, గో–కార్ట్ ట్రాక్స్, ఎమ్యూజ్‌మెంట్ రైడ్స్, బంపర్ కార్స్ వంటి వివిధ సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

పార్కుల ప్రయివేటీకరణ సరికాదు

కాకినాడ నగరపాలక సంస్థ పార్కుల ప్రయివేటీకరణ ప్రతిపాదనను అధికారులు ఉపసంహరించుకోవాలి. ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే వివిధ ఛార్జీలను పెద్ద మొత్తంలో వసూలు చేస్తారు. పబ్లిక్ స్థలాల్లో ప్రజలు సంచరించడానికి ఎటువంటి తారతమ్యాలకు తావుండరాదని భారత రాజ్యాంగం చెబుతోంది. ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని నగరపాలక సంస్థ నిధుల ద్వారా అన్ని పార్కులను అభివృద్ధి చేయాలి.

-పలివెల వీరబాబు, సిపిఎం నగర కన్వీనర్



ఆహ్లాదకరంగా కనిపిస్తున్న కాకినాడ వివేకానంద పార్క్

అభివృద్ధిలో వెనకబడిన పార్కులు


నగరంలో 24 పార్కులు ఉన్నాయి. అయితే అనేక పార్కులు నేటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు వాటిలో కాలు కూడా మోపని పరిస్థితి ఏర్పడింది. అయితే అధికారులు నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేసిన పార్కులను మాత్రమే ప్రయివేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. అయితే అభివృద్ధిలో వెనుకబడిన పార్కులను ఎందుకు అప్పగించడం లేదనేది పలువురి వాదన. వివేకానంద పార్కు, గాంధీ నగర్, జన్మభూమి, బోట్ క్లబ్ పార్కులు కార్పొరేషన్ నిర్వహిస్తోంది. సెక్యూరిటీ, క్లీనింగ్, పారిశుధ్యం పనులను ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ కార్మికులు నిర్వహిస్తున్నారు. మిగిలిన పార్కులను స్థానిక అసోసియేషన్లకు తక్కువ మొత్తంలో అంటే నెలకు రూ.6 వేలు ఇస్తూ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయితే చాలా పార్కులు పూర్తిస్థాయిలో నిర్వహణ లేక అభివృద్ధి కానరాక వెలవెలబోతున్నాయి. అయితే స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేసిన వాటిని మాత్రమే ప్రయివేటు సంస్థలకు బాధ్యతలు అప్పగిస్తామనడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పౌరులు పార్కులలో సంచరించడానికి ఆటంకాలు కల్పించడం రాజ్యాంగ విరుద్ధం అనే వాదనలు మరోవైపు వినిపిస్తున్నాయి. ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే పార్కులలో ప్రవేశానికి మొదలుకొని ఇతర అవసరాలకి పెద్ద మొత్తంలో ఛార్జీలను వసూలు చేస్తారు. ఫుడ్ కోర్టులను వెలుపల అనుమతిస్తే ఆహ్లాదకరంగా ఉండాల్సిన పార్కులు వ్యర్థాలకు నిలయాలుగా మారతాయని విమర్శలు వెలువెత్తుతున్నాయి. గతంలో కుళాయి చెరువు పార్కులో వ్యవసాయ శాఖ ఫల పుష్ప ప్రదర్శన నిర్వహించేది. నగర ప్రజల కోరిక మేరకు దానిని తొలగించారు. అయితే పాలకవర్గం లేకుండా, ప్రజా ప్రతినిధుల వైఖరి తెలియజేయకుండా పార్కులను ఏ విధంగా ప్రయివేటు వ్యక్తులకు ఇస్తారనేది సిపిఎం నాయకులు ప్రశ్నిస్తున్నారు. జగన్నాధపురం ప్రాంతంలో సుమారు 1.50 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో అన్నమ్మ ట్యాంక్ అభివృద్ధి అరకొరగానే ఉంది. సామాన్యులు నివసించే ఇటువంటి చోట్ల పార్కులను అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురి సామాజిక వేత్తల అభిప్రాయం. అధికారుల పార్కుల ప్రయివేటీకరణ ప్రతిపాదనను పక్కన పెట్టాలనే డిమాండ్ ముందుకొస్తుంది. కావున నగరంలో ఉన్న అన్ని పార్కులను నగరపాలక సంస్థ ద్వారా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అభిప్రాయం సర్వాత్ర వినిపిస్తోంది.

విద్యుత్ శాఖ ముందస్తు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఆలమూరు


క్రేన్‌లతో సిద్ధంగా ఉన్న విద్యుత్ శాఖ సిబ్బంది

తుపాన్ ప్రభావంతో జరగరాని విపత్తు ఎదురైతే దానిని ఎదుర్కొనేందుకు విద్యుత్ ముందస్తు ఏర్పాట్లు చేసింది. మండపేట ఎడిఇ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలతో పాటు క్రేన్లను అందుబాటులో ఉంచారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడైన విద్యుత్ సమస్యలు ఎదురైతే సమాచారాన్ని చేరవేసేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎడిఇ సిహెచ్.శ్రీధర్ తెలిపారు. ఏదైనా సమస్య ఉత్పన్నం అయితే మండపేట టౌన్ 9440904519, ద్వారపూడి సెక్షన్‌లో 9440904527, ఆలమూరు సెక్షన్‌లో 9440904521, రాయవరం సెక్షన్‌లో 9493178873, ఏడిద సెక్షన్‌లో 9440904503 నెంబర్లకు తెలియ చేయాలని సూచించారు. తుపాను ప్రభావంతో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు ఒరిగినా, వైర్లు తెగిపడిన ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అటువంటి పరిస్థితి ఏర్పడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి సమాచారం చేరవేయాలని కోరారు.



దీక్షను కొనసాగిస్తున్న రవికుమార్

కొనసాగిన రవికుమార్ దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్‌స్టాండ్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చికురుమిల్లి రవికుమార్ చేపట్టిన రిలే దీక్ష సోమవారం వర్షంలోనూ కొనసాగింది. స్థానిక సమైఖ్యాంధ్ర శిబిరం వద్ద రవికుమార్ చేస్తున్న రిలే దీక్ష సోమవారం 17 రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పొట్టిలంకకు చెందిన పోతుల భారతి, హేమ సుందరనారాయణరావు సంఘీభావం తెలిపారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొత్తపేట

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే స్థానిక అధికారులకు, కూటమి నాయకులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తుపానును దృష్టిలో పెట్టుకుని ముంపు భారిన పడిన బాధితులకు జనసేన కార్యకర్తలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో కొత్తపేట రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూం 08855-244299, 85002-38258 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సత్యనారాయణకు అబ్దుల్ కలాం అవార్డు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని యర్రవరం సూర్య విద్యాసంస్థల అధినేత కెవివి.సత్యనారాయణకు డాక్టర్ ఎబిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో మాజీ ఎంఎల్‌సి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ ఏజెన్సీ ముఖ ద్వారమైన యర్రవరంలో తక్కువ ఫీజులకే పేద విద్యార్థులకు విద్యను అందించడమే కాక ఆయన నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు తెలిపారు. లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగయ్య సత్యనారాయణను ప్రశంసించారు. ఎసత్యనారాయణకు అవార్డు లభించడం పట్ల సంఘం గౌరవాధ్యక్షుడు కెఎస్ఎల్.లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు కె.గోవిందరావు, ఎన్‌విఎస్.రఘు ప్రదీప్, రాజా రత్నకుమార్, కొండపల్లి విల్సన్ బాబు అభినందించారు.

భీమేశ్వర ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - రామచంద్రపురం


ఆలయ కాంప్లెక్స్‌లో యాత్రికులు

ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి సోమవారం యాత్రికులు పోటెత్తారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఆలయానికి యాత్రికులు పెద్దఎత్తున చేరుకున్నారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ యాత్రికులతో కిటకిటలాడాయి. శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

యాత్రికునికి అస్వస్థత

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక జనార్ధన స్వామి ఆలయానికి వచ్చిన యాత్రికుడు అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్పందించిన ఆలయ అర్చకులు అంగర సాయి భగవాన్ ఆచార్యులు ప్రాథమిక వైద్యాన్ని అందజేశారు. దీంతో యాత్రికుడు కోలుకున్నాడు. తక్షణమే స్పందించి వైద్యాన్ని అందించిన అర్చకుడిని ఆలయ ఛైర్మన్ బైరిశెట్టి రాంబాబు, గ్రామస్తులు అభినందించారు.

81 మందికి గృహ రుణాల మంజూరు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో 1996 తుపాను తర్వాత ఆది ద్రావిడశాఖ ద్వారా ఎస్‌సి గ్రామాల్లో రూ.35 వేలతో నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి స్థానంలో ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.5 లక్షలు గృహ నిర్మాణ స్కీమ్ అమలు చేస్తూ దీపావళి అనంతరం ఆదేశాలు వచ్చాయి. ఆవిధంగా 61 మంది లబ్దిదారులకు మొదటి దఫా సొమ్ము ఒక్కొక్కరికీ రూ.2 లక్షల 50 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు.

తుపానుపై అధికారులతో ఆర్ఎఒ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

మొంథా తుపాను దూసుకొస్తున్న నేపథ్యంలో ఎన్‌డిఆర్ఎఫ్ రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్య, పోలీస్, మున్సిపాలిటీ, వ్యవసాయ, పిడబ్ల్యుడి తదితర శాఖల అధికారులతో ఆర్ఎఒ అంకిత్ కుమార్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో యానాం ఆర్ఎఒగా పని చేసిన ఆమన్ శర్మను సైక్లోన్ ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. దీంతో సోమవారం అమన్‌శర్మ యానాం చేరుకుని సమావేశంలో పాల్గొన్నారు. పునరావస కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు.

డిప్యూటీ తహశీల్దారుగా జువ్వల బాలశ్రీ

ప్రజాశక్తి - యానాం

యానాం రెవెన్యూ శాఖ నూతన డిప్యూటీ తహశీల్దార్‌గా జువ్వల బాలశ్రీని నియమిస్తూ పుదుచ్చేరి రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి కులోత్తుంగన్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన జ్యోతి వెంకటేశ్వర్లును తూనికలు కొలతలు శాఖకు బదిలీ చేశారు.

జమీల్‌కు మాజీ సిఎం జగన్ పరామర్శ

ప్రజాశక్తి -రౌతులపూడి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్ తండ్రి వెంకటేశ్వర్లు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుమారుడు జమీల్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. మృతికి గల కారణాలను జమీల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. వాసిరెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

భీమేశ్వరాలయంలో ఎంఎల్ఎ పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప కుటుంబంతోత కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎంఎల్ఎకు చినరాజప్పకు ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండల్ ఛైర్మన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎంపిని నిలదీసిన మత్స్యకారులు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

సముద్రపు ఒడ్డున నివసిస్తున్న మత్స్యకారులకు ఇళ్ల స్థలాల కేటాయిస్తే తుపానుల ముప్పు తప్పుతుంది కదా అని మత్స్యకారులు కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాసును నిలదీశారు. సోమవారం ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎంపీకి చేదు అనుభవం ఎదురయ్యింది. మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని ఎంపీ సూచిస్తున్న తరుణంలో కొంతమంది మత్స్యకారులు ఎంపీ ఉదయ శ్రీనివాసుని నిలదీశారు. కొన్ని సంవత్సరాలుగా ఉప్పాడ అలల తాకిడికి గృహాలు సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయని, తుపానుల సమయంలో మాత్రం అధికారులు, నాయకులు హడావిడి చేసి వెళ్ళిపోతున్నారు తప్ప మత్స్యకారులను పట్టించుకోవడం లేదన్నారు. తమ స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మిస్తే తుపానుల ముప్పు తప్పుతుంది కదా అని ప్రశ్నించారు. పునరావాస కేంద్రాలకు వెళ్ళేది లేదని, తమకు తుపానులు అలవాటే అని ఎంపీకి తెలిపారు.

భవన కార్మికుల సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని భవన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు పిలుపు ఇచ్చారు. స్థానిక బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయం వద్ద సోమవారం మండల కమిటీ సమావేశంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడారు. 2వ మహాసభలు జగ్గంపేటలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అక్టోబర్ 31న జగ్గంపేట సెంటర్లో కార్మికుల సమస్యలపై సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తామని, నవంబర్ 1న జగ్గంపేటలో గోకవరం రోడ్డులోని కాపు కల్యాణ్ మండపంలో ప్రతినిధుల సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ మహాసభకు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. ఈ మహాసభలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు శీరం సత్తిబాబు, పి.శ్రీను, పి.దేవుళ్లు, అమరాది దొరబాబు, బూదిన సత్తిబాబు పాల్గొన్నారు.

కాలినడకన వచ్చే వారికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే యాత్రికుల దర్శనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ ముదునూరు వెంకటరాజు, ఆలయ డిసి నల్లం సూర్యచక్రధర్‌రావు అన్నారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా నవుడూరు, నెలమూరు గ్రామాల నుంచి 250 మంది యాత్రికులు ఆదివారం ఉదయం పాదయాత్రగా బయలుదేరి సోమవారం మధ్యాహ్నానికి వాడపల్లి వెంకన్న ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.